క్లుప్తంగా

నిత్యావసరాల వితరణ

విజయనగరం: మండలంలోని పెదవేమలి గ్రామంలో ఉన్న ఏబీసీడీ వృద్ధాశ్రమానికి గురువారం కంటోన్మెంట్ ఆర్యవైశ్య సేవాసంఘం సభ్యులు రూ.10వేల విలువైన నిత్యావసర వస్తువులతో పాటు మహిళలకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ముమ్మిడిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ వృద్ధులకు సేవ చేయడంలో సంతృప్తి కలుగుతుందన్నారు. కార్యదర్శి డిమ్స్ రాజు మాట్లాడుతూ ప్రతినెలా కిరాణా సరుకులు, ఇతర సామాగ్రి ఆరు నెలలు పాటు ఇచ్చేందుకు సిద్ధమైనట్లు చెప్పారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం ఇన్‌ఛార్జి లక్ష్మి, కోశాధికారి పూసర్ల వెంకట త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

నెల్లిమర్ల: విద్యార్థులు సైన్స్ పట్ల అభిరుచి పెంచుకోవాలని నెల్లిమర్ల బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ ఆనందమూర్తి సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ గురువారం నిర్వహించారు. ఈ పోటీల్లో బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థులు పి.సౌభాగ్య, కె.శరణ్య, కె.జీవనప్రీతి ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలను హెచ్‌ఎం ఆనందమూర్తి అభినందించారు. జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు సత్యప్రకాశ్, రమణారావు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బంది సమ్మె నోటీసు

నెల్లిమర్ల: ఈనెల 26 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జరిగే సమ్మెలో మున్సిపల్ సిబ్బంది పాల్గొంటున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ.జగన్మోహన్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రవి తెలిపారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం సమ్మెకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. అనంతరం సమ్మె నోటీసును నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీప్రసాద్‌కి అందజేశారు.

రెడ్‌క్రాస్ యాప్‌పై అవగాహన

విజయనగరం ఫోర్ట్: స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని చిన్న శ్రీను సోల్జర్ సంస్థ అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర కోరారు. స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో ఏపీ రెడ్ క్రాస్ మొబైల్ యాప్‌పై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ యాప్‌లో రిజిస్టర్ అయిన వారికి గుర్తింపు కార్డు వస్తుందని, రక్తదానం చేసే వారికి ప్రశంసా పత్రం వస్తుందన్నారు. ఈ యాప్‌ను ప్రతి ఒక్కరూ తమ స్మార్ట్‌ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కె.ఆర్.డి ప్రసాదరావు, కార్యదర్శి సత్యం పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో మేట్లదే కీలకపాత్ర

విజయనగరం రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పనుల్లో మేట్‌లదే కీలకపాత్రని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన మేట్‌ల శిక్షణ కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల్లో పాల్గొనే కూలీల మస్తర్లు, వేతనం, పనుల వద్ద ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలు, తదితర అంశాల్లో మేట్‌లు ప్రధాన భూమిక వహించాలన్నారు. అవకతవకలకు తావులేకుండా చూడాల్సిన బాధ్యత మేట్‌లదేనన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఈఓపీఆర్డీ డి.తిరుపతినాయుడు, ఉపాధిహామీ పథకం ఏపీవో రవి, తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తుమార్గం అనుసరణీయం

విజయనగరం అర్బన్: జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం సాయంత్రం క్రిస్మస్ వేడుకలు జరిగాయి. తొలుత కేక్ కట్ చేశారు. బైబిల్ వ్యాఖ్య పఠనంతో ప్రార్థనలు, భక్తిగీతాలాపనలు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్వో ఎస్.డి.అనిత మాట్లాడుతూ క్రీస్తు మార్గం అనుసరణీయమైనదన్నారు. ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఉదయ్ చంద్ర బెహ్రా, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి.ప్రేమానందం క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి టి.చంద్రశేఖర్ మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో బిషప్ ఎం.పాల్సన్, రెవరెండ్ ఎస్.మధు, జయప్రకాష్, యాబోజు, ఎలీషా, వి.సత్యరాజు, ఎల్.మధుసూదనరావు, థామస్‌పాల్, రమేష్, సుధాకరరావు, ముస్లిం తమ పెద్ద మునీర్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ వెల్లడిస్తే చర్యలు

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: స్కానింగ్ సెంటర్లు లింగ నిర్ధారణ వెల్లడిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం పీసీపీఎన్‌డీటీ చట్టంపై ప్రభుత్వ, ప్రైవేటు స్కానింగ్ సెంటర్ల నిర్వాకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గర్భంలో ఉన్న పిండం ఎదుగుదల గురించి మాత్రమే చెప్పాలని సూచించారు. ఆడపిల్లలు తక్కువగా ఉన్న మండలాల్లో స్కానింగ్ సెంటర్లను పోగ్రాం అధికారులు తరుచూ పరిశీలించాలని ఆదేశించారు. అంతకుముందు కొత్తగా విధుల్లో చేరిన వైద్యులకు విధుల పట్ల శిక్షణ ఇచ్చారు. సమావేశంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయలక్ష్మి, డీఎల్‌ఓ డాక్టర్ రాణి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సూర్యనారాయణ, దిశ పోలీస్ స్టేషన్ ఎస్సై శ్యామల, డెమో చిన్నతల్లి, నేచర్ సంస్థ ప్రతినిధి దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

హ్యాపీ బర్త్‌డే జగనన్నా..

సంక్షేమ ప్రదాత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉత్సవంలా నిర్వహించారు. భారీ కేక్‌లు కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రోగులకు పండ్లు, రొట్టెలు, వృద్ధులకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జై జగన్ నినాదాలతో ఊరూవాడ మార్మోగాయి. – సాక్షి నెట్‌వర్క్


నెల్లిమర్ల రూరల్: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు


పూసపాటిరేగ: మండల కేంద్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకల్లో కేక్‌కట్ చేస్తున్న ఎంపీపీ కల్యాణి, జడ్పీటీసీ సీతాలక్ష్మి, తదితరులు


భోగాపురం: మండల పరిషత్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ ఉప్పాడ అనూషరెడ్డి


భోగాపురం: రావివలసలో విద్యార్థులతో కేక్ కట్ చేయిస్తున్న హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి


విజయనగరం రూరల్: పినవేమలిలోని ఏబీసీడీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, దుప్పట్లు అందిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు


డెంకాడ: మండల పరిషత్ ఆవరణంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ వాసుదేవరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కనకసింహాచలం, తదితరులు


విజయనగరం రూరల్: గుంకలాంలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు

రామతీర్థం ఆలయంలో ప్రత్యేక పూజలు


నెల్లిమర్ల రూరల్: కేక్ కట్ చేస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి గురువారం ప్రత్యేక పూజలు చేపట్టారు. జగనన్న మళ్లీ సీఎం కావాలని, ఆయన ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ స్వామివారి మెట్ల వద్ద 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, హోమాలు చేయించారు. 120 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. భారీ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. సీఎం జగన్ పేరిట అన్నసమారాధన చేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు, సీనియర్ నాయకుడు కందుల రఘుబాబు, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, పార్టీ మండల అధ్యక్షులు చనమల్లు వెంకటరమణ పాల్గొన్నారు.

దివ్యాంగులకు బ్యాటరీ వాహనాల పంపిణీ

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయాయాదవ్, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, పలువురు కార్పొరేటర్లు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ముందుగా డిప్యూటీ స్పీకర్ కేక్ కట్ చేసి ఎమ్మెల్సీ సురేష్ బాబుతో పాటు ఇతర ప్రజాప్రతినిధులకు పంచిపెట్టారు. అనంతరం నిరుపేద దివ్యాంగులకు బ్యాటరీతో నడిచే త్రిచక్ర వాహనాలను పంపిణీ చేశారు. కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి

నగర సిగలో కొత్త అందం

- రూ.40 లక్షల వ్యయంతో రింగ్‌రోడ్‌లో గజరాజుల విగ్రహాల ఏర్పాటు
- ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నగర సుందరీకరణలో మరో అందాల ఆకృతి మెరిసింది. 29వ డివిజన్ రింగ్ రోడ్డు ప్రాంతంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ముఖద్వారం వద్ద రూ.40లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన గజరాజుల ఆకృతులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి గురువారం ప్రారంభించారు. ఏనుగుల విగ్రహాల చుట్టూ ఫౌంటెన్‌లను ఏర్పాటు చేసి విద్యుత్‌దీపాలతో కాంతిలీనం చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, లయ యాదవ్, జోనల్ ఇన్‌చార్జి కోలగట్ల కృష్ణారావు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్, కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దక్షిణామూర్తి, తదితరులు పాల్గొన్నారు.


గజరాజుల విగ్రహాలను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విజయనగరం: నగరం శరవేగంగా అభివృద్ధి చెందితూ కొత్తరూపు సంతరించుకోవడం ఆనందంగా ఉందని మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. నగరంలోని 49వ డివిజన్ గాజులరేగలో రూ.20 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నగర ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడే లక్ష్యంగా అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నగరాభివృద్ధికి విశేషంగా కృషిచేస్తున్నారన్నారు. మరోసారి కోలగట్లను ఎమ్మెల్యేగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణ, కణుగుల రాజా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, తదితరులు

23న సెంచూరియన్ వర్సిటీ స్నాతకోత్సవం

నెల్లిమర్ల రూరల్: టెక్కలిలోని సెంచూరియన్ విశ్వవిద్యాలయం మూడో స్నాతకోత్సవ వేడుకలను ఈ నెల 23న నిర్వహించనున్నట్టు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంతకుమార్ మహంతి తెలిపారు. వర్సిటీలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్నాతకోత్సవంలో ఒకరికి డాక్టరేట్, 140 మందికి డిగ్రీలను ప్రదానం చేస్తామన్నారు. 12 మందికి బంగారు పతకాలు, ఏడుగురికి నగదు ప్రోత్సాహకాలు అందిస్తామని చెప్పారు. విశ్వ విద్యాలయంలో ఆచరణాత్మక పద్ధతుల్లో విద్యను బోధించడం వల్ల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ మార్కెట్‌లో నేడు డిమాండ్ ఉన్న కోర్సులను వర్సిటీలో అందుబాటులో ఉంచామని చెప్పారు. వేడుకలను చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్‌ఎన్ రాజు, చైర్మన్ ప్రొఫెసర్ ముక్తికాంత మిశ్రా ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ మాధవరావు, ఎంఎల్‌ఎన్ ఆచార్యులు, డాక్టర్ సన్నీ డియోల్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సెంచూరియన్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.కె.మహంతి

బధిరుల పాఠశాలలో..


విద్యార్థులతో చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర

విజయనగరం రూరల్: పట్టణంలోని మూగ, చెవిటి పాఠశాల(ఎస్‌ఎంఆర్‌పీఆర్‌సీ)లో చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజున వేడుకలు ఘనంగా నిర్వహించారు. సిరిసహస్ర కేక్ కట్ చేసి చిన్నారులకు పంచిపెట్టారు. అనంతరం విద్యార్థులకు దుప్పట్లు, బిస్కెట్లు, చాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిన్నశ్రీను సోల్జర్స్ సభ్యులు పాల్గొన్నారు.

సిక్స్ సిగ్మాపై వర్క్‌షాప్

డెంకాడ: జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో సిక్స్ సిగ్మాపై రెండు రోజుల పాటు జరగనున్న వర్క్‌షాప్ గురువారం ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమంలో రీసోర్సు పర్సన్‌గా వ్యవహరించిన ఎన్‌ఎస్‌టీఎల్ సైంటిస్ట్–డి వి.శ్రీనివాసరావు మాట్లాడారు. విద్యార్థులకు ఉత్పత్తి అభివృద్ధి, నాణ్యత నియంత్రణ, గణాంక ప్రక్రియ నియంత్రణ పరంగా సిక్స్ సిగ్మా పాత్రను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, కన్వీనర్ సతీష్‌పూజారి, రీసోర్స్ పర్సన్ కె.శ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కెరీర్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోండి

విజయనగరం క్రైమ్: విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రుల కలలన సాకారం చేయాలని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు సూచించారు. అయ్యన్నపేటలోని ఎస్.కె.డిగ్రీ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్ వద్ద కలిగే అనర్థాలు, కెరీర్ గైడెన్స్ పట్ల గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని కెరీర్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్తుపదార్థాల అక్రమ రవాణా, నియంత్రణకు సహకరించాలని, ఎక్కడైనా మత్తుపదార్థాలు గుర్తిస్తే 14500కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ

నెల్లిమర్ల: కౌశల్ ప్రతిభాన్వేషణ పోటీల్లో నెల్లిమర్ల జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు పి.సౌభాగ్య, పి.స్నేహసూర్య, ఎం.హాసిని జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 30న నిర్వహించే ఈ పోటీల్లో వీరు పాల్గొంటారు. విజేతలకు హెచ్‌ఎం జీఎం శారద, గైడ్ టీచర్ ఆర్.శ్రీకుసుమ, ఉపాధ్యాయులు అభినందించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

నెల్లిమర్ల రూరల్: రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా ప్రజల మన్ననలు పొందుతున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. నగర పంచాయతీ పరిధి ఇందిరా కాలనీలో గురువారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో చేసిన మంచిని ప్రజలకు వివరించారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి అర్హులందరికీ సంక్షేమ పథకాలు నేరుగా చేరవేస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధిలోనూ ఏ మాత్రం వెనుకంజ వేయలేదన్నారు. మంచి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా నిలబడాలని కోరారు. అనంతరం స్థానికులు పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా వాటిని తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజినీ, వైస్ చైర్మెన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణారావు, పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, పార్టీ మండల అధ్యక్షుడు చనమళ్ల వెంకటరమణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స, తదితరులు

దివ్యాంగుల సంక్షేమానికి సీఎం జగన్ కృషి

విజయనగరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్నారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సీఎం జగన్ పుట్టినరోజు సందర్భంగా జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద జిల్లా వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం దివ్యాంగులకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు డి.కొండబాబు మాట్లాడుతూ.. దివ్యాంగుల రిజర్వేషన్‌ను 3 నుంచి 5 శాతానికి పెంచడంతో పాటు వేధింపులకు గురికాకుండా ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చి ప్రభుత్వం దివ్యాంగులకు రక్షణ, భరోసా కల్పించిందన్నారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు కేవీ సూర్యనారాయణ రాజు, వేపాడ జెడ్పీటీసీ సభ్యులు సేనాపతి అప్పారావు, జిల్లా దివ్యాంగుల విభాగం ఉపాధ్యక్షులు మజ్జి సత్యనారాయణ, రమ్య, పలువురు దివ్యాంగులు పాల్గొన్నారు.

దేవీశ్రీ సాహిత్యం భావితరాలకు స్ఫూర్తి

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: మజ్జి దేవీశ్రీ సాహిత్యం రానున్న తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం ఉదయం మజ్జి దేవీశ్రీ రాసిన పాటల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవీశ్రీ సుమారు 3 వేల పాటలు రాశారని, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అనుకూలంగా పర్యావరణం, అభివృద్ధి, ఆడపిల్లలపై జరుగుతున్న అత్యాచారాలు, నిరక్షరాస్యతపై రాసి, పాడిన పాటలు ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. వంగపండు వారసత్వాన్ని పునికి పుచ్చుకున్నారని దేవీశ్రీని కొనియాడారు. దేవీశ్రీ రాసిన పాటలపై ఆంధ్ర యూనివర్సిటీలో పరిశోధనలు చేయడం శుభపరిణామమని అన్నారు. కళాకారులను, కవులను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గౌరవంగా చూసుకుంటుందన్నారు. 2021 సంవత్సరంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా మజ్జి దేవీశ్రీ వైఎస్సార్ లైఫ్ టైం ఎచీవ్‌మెంట్ అవార్డు అందుకోవడం సంతోషదాయకమన్నారు. సమాజాన్ని ఉత్తేజపరుస్తూ, ప్రజల్లో సామాజిక అంశాలపట్ల అవగాహన కల్పించేలా భవిష్యత్తులో మరిన్ని పాటలు రాయాలని, వంగపండు, గద్దర్ వారసత్వాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు.


దేవీశ్రీ రాసిన పాటల పుస్తక ఆవిష్కరణలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సేవాతత్వమే క్రీస్తు బోధనల సారాంశం

విజయనగరం టౌన్: సేవాతత్వమే క్రీస్తు బోధనల సారాంశమని పట్టణానికి చెందిన డాక్టర్ అవనాపు భానుప్రకాష్ అన్నారు. స్థానిక అంబటిసత్రం జంక్షన్ సమీపంలో ఉన్న యేసు ప్రేమాలయంలో పాస్టర్ అలజంగి రవికుమార్ ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన భానుప్రకాష్ కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆకలిగా ఉన్నవారికి అన్నం పెట్టడం, దుస్తులు లేనివారికి దుస్తులు ఇవ్వడం వంటి సేవాతత్వాన్ని క్రీస్తు బోధించారని, ఈ మార్గంలో జనులంతా నడవాలని సూచించారు. పాస్టర్ అలజంగి రవికుమార్ మాట్లాడుతూ త్యాగానికి ప్రతిరూపమైన ఏసుక్రీస్తు బోధనలు సర్వమానవాళికి అనుసరణీయమన్నారు. ఈ సందర్భంగా

కేవీలో ఘనంగా వార్షిక క్రీడోత్సవాలు

విజయనగరం అర్బన్: పట్టణంలోని కేంద్రీయ విద్యాలయంలో వార్షిక క్రీడోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. ప్రిన్సిపాల్ దిలీప్ మోడీ జ్యోతిని వెలిగించి క్రీడాలను ప్రారంభించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్‌తో ఆయనకు ఆహ్వానం పలికారు. గంగా, గోదావరి, నర్మద, యమునా నదుల పేరు మీదున్న నాలుగు హౌసెస్ కింద మొత్తం విద్యాలయ విద్యార్థులను విభజించి పోటీలు నిర్వహించారు. ఓవరాల్ ఛాంపియన్‌గా గోదావరి విద్యార్థులు నిలిచారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముగింపు కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజనల్ ఆఫీసర్ నరేష్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేసారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయిలో ప్రావీణ్యం కనపరిచిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సీఎం జగన్ కృషి

- ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స
- విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

నెల్లిమర్ల రూరల్: పేద విద్యార్థుల చదువులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని, ప్రభుత్వ ప్రోత్సాహంతో విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. రామతీర్థం ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు గురువారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. బైజూస్ కంటెంట్‌తో అందిస్తున్న ఒక్కో ట్యాబ్‌కు ప్రభుత్వం రూ.32 వేలు ఖర్చు చేస్తోందని, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

- నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ చైరపర్సన్ గదల బంగారమ్మ గురువారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు.
- భోగాపురం: మండలంలోని రావాడ, గూడెపువలస, చాకివలస, అమటాం, కవులవాడ, సవరవిల్లి, భోగాపురం ఉన్నత పాఠశాలల్లో, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 336 మంది విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన ట్యాబ్‌లను ఎంపీపీ ఉప్పాడ అనూషరెడ్డి గురువారం పంపిణీ చేశారు.
- పూసపాటిరేగ: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన బైజుస్ కంటెంట్ ట్యాబ్‌లను ఎంపీపీ మహంతి కల్యాణి, జడ్పీటీసీ మహంతి సీతాలక్ష్మి గురువారం పంపిణీ చేశారు.


నెల్లిమర్ల రూరల్: విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స, తదితరులు


పూసపాటిరేగ: విద్యార్థులకు టాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కల్యాణి, జడ్పీటీసీ సీతాలక్ష్మి, తదితరులు


భోగాపురం: ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో ఎంపీపీ అనూషరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, తదితరులు


నెల్లిమర్ల రూరల్: కొండవెలగాడ పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న బంగారమ్మ